క్లుప్తంగా

కమ్యూనిస్టు ఉద్యమంలో మోటూరు కీలకపాత్ర



భీమవరంలో మోటూరు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో కీలకపాత్ర పోషించి అన్ని రంగాల్లో సమగ్రమైన అవగాహన కలిగిన బహుముఖ ప్రజ్ఞాశాలి మోటూరు హనుమంతరావు అని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంతెన సీతారామ్ అన్నారు. బుధవారం మోటూరు 23వ వర్ధంతి సందర్భంగా భీమవరం పట్టణంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సీతారామ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బి బలరామ్, నాయకులు జెఎన్ విగోపాల్, కౌరు పెద్దిరాజు, పీవీప్రతాప్, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల జారీకి కృషి చేస్తా



మంత్రి కొండపల్లి శ్రీనివాసరావుని కలిసిన పెన్నాడ తూర్పు కాపు సంఘ నాయకులు

పాలకోడేరు: తూర్పు కాపుల సర్టిఫికెట్ల విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతోందని వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. బుధవారం భీమవరంలో పెన్నాడ తూర్పు కాపు నాయకులతో ముచ్చటించారు. తూర్పు కాపులను మూడు జిల్లాల్లో మాత్రమే బీసీలుగా పరిగణిస్తున్నారని, దీంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని మంత్రి దష్టికి తీసుకొచ్చారు. మంత్రిని కలిసిన వారిలో తూర్పు కాపు విద్యా విజ్ఞానాభివృద్ధి సంఘం జిల్లా అధ్యక్షుడు సరిపిడకల రామారావు, పెన్నాడ అధ్యక్షుడు చిల్లా సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు ఆదాడ కృష్ణ మోహనరావు, పాండ్రంకి శ్రీను, మాజీ ఎంపీటీసీ దాసరి కిరణ్, తదితరులు ఉన్నారు.

రోగులకు రొట్టెల పంపిణీ



ప్రభుత్వాసుపత్రిలో రోగులకు రొట్టెలు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ అంకెం సీతారామ్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం బాపిరాజు, సీతారామ్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి దీటుగా కాంగ్రెస్ పార్టీని ముందుకు నడిపించిన వ్యక్తి రాహుల్‌గాంధీ అంటు ప్రశంసించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు రొట్టెలు పంపిణీ చేశారు. పార్టీ మహిళా అధ్యక్షురాలు సోడదాసి సెల్వియా నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం నగదు చెల్లించాలి



ఆచంటలో తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: రైతుల ధాన్యానికి నగదు సత్వరం చెల్లించాలని సీపీఎం నాయకులు తలుపూరి బుల్లబ్బాయి అన్నారు. కౌలు, పేద రైతులకు తక్షణమే ధాన్యం బకాయిలు చెల్లించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఆచంట తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్ ఐపీ శెట్టికి వినతి పత్రం అందించారు. మండలంలో ఇప్పటి వరకూ కేవలం రూ.7 కోట్లు మాత్రమే చెల్లింపులు అయ్యాయని, మరో రూ.55 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం నెలలు తరబడి డబ్బులు చెల్లించకపోవడం వలన తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగి తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఉన్నతాధికారులు రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు సిర్రా నరసింహమూర్తి, గుత్తుల రంగారావు, పి.మోహన్‌రావు, కుసుమే జయరాజు, తోటపల్లి సత్యనారాయణ, కొండేటి రాఘవులు పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం

పెనుగొండ: బ్రహ్మకుమారీస్ ఓంశాంతి ఆధ్వర్యంలో పెనుగొండలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తేతలి వారి వీధిలో బ్రహ్మకుమారీస్ కార్యాలయంలో బుధవారం ఉదయం నుంచి హోమియో వైద్యుడు డాక్టర్ సత్యనారాయణ వైద్య పరీక్షలు నిర్వహించారు. 190 మంది వైద్య పరీక్షలు చేయించుకోగా, వారికి ఉచితంగా మందులు అందించారు.

కొండెక్కిన కూరగాయల ధరలు

వీరవాసరం: కూరగాయల ధరలు ఆకాశాన్నంటి కొనుగోలు దారులకు చుక్కలు చూపిస్తున్నాయి. అన్ని రకాల కూరగాయలు, దుంపలు, ఆకుకూరల ధరలు చూసి కొనుగోలుదారులు బెంబేలెత్తుతున్నారు. ఉల్లి సైతం పెరిగిన ధరభారంతో వినియోగదారులకు కంట కన్నీరు రప్పిస్తున్నాయి. రెక్కాడితే గాని డొక్కాడని జనాలకు కూరగాయల ధరలు పెరుగుదల ఆందోళన కలిగిస్తున్నాయి. గత పది రోజుల క్రితం వరకు మార్కెట్లో కిలో వంకాయల ధర 30 రూపాయల నుంచి 40 రూపాయలు ఉండేది. ప్రస్తుతం వీటి ధర 80 రూపాయల నుంచి వంద రూపాయలకు చేరింది. కిలో బెండకాయలు ,దొండకాయలు, బీరకాయలు ధర 25 రూపాయల నుంచి 30 రూపాయలు ఉండేది. ప్రస్తుతం వీటి ధర 80 రూపాయల నుంచి 90 రూపాయలకు చేరింది. కిలో పచ్చిమిర్చి,చిక్కుళ్లు 60 రూపాయల నుంచి 80 రూపాయలు ఉండేది. ప్రస్తుతం కిలో బంగాళాదుంపలు 70 నుంచి 80 రూపాయలు అమ్ముతున్నారు. కిలో క్యారెట్, బీట్రూట్ ధర గతంలో 40 రూపాయల నుంచి 50 రూపాయలు ఉండేది. ప్రస్తుతం వీటి ధర 120 రూపాయలు నుంచి 150 రూపాయలకు అమ్ముతున్నారు. దీంతో చేసేదేమీ లేక కొన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేసి తీసుకెళ్లారు.



కూరగాయల దుకాణం

ఏం కొనేటట్టు లేదు..ఏం తినేటట్టు లేదంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు. కాయగాయల ధరలు రోజు రోజుకూ కొండెక్కుతున్నాయి. మార్కెట్‌కు వెళ్లి కూరగాయలను చూస్తేనే ప్రజల గుండె గుభేలుమంటోంది. కూరగాయలు కిలో ధర రూ.80 పైనే పలుకుతోంది.

భగ్గుమంటున్న పప్పు దినుసుల ధరలు..

పప్పు దినుసులు ధరలు కూడా భగ్గుమంటున్నాయి. మినపప్పు, పెసరపప్పు, కందిపప్పు, బొబ్బర్లులాంటి పప్పుధాన్యాలు కొనే పరిస్థితి లేదు అని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండాకాలం కారణంగా దిగుబడి లేదంటూ వ్యాపారులు అధిక ధరలకు పప్పు దినుసులు విక్రయిస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా కూరగాయలు, ఆకు కూరల దిగుబడి ఈ ఏడాది తగ్గిందని రైతులు అంటున్నారు. మెట్ట ప్రాంతం నుంచి కాయగూరలు మార్కెట్‌కు వస్తుంటాయి. ఈ ఏడాది మార్కెట్‌కు తక్కువ సరుకు రావడంతో ధరలు అమాంతంగా పెరిగాయని వ్యాపారులు అంటున్నారు. సూపర్‌బజార్లలోనూ ధరలు మండిపోతున్నాయి. చిత్తూరు, బెంగుళూరు, కర్నూలు, తమిళనాడు నుంచి కాయగాయలు దిగుమతి చేస్తుండటంతో ధరలు పెరిగాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

> “
>
> **కూరగాయలు కొనాలంటేనే భయమేస్తోంది**
>
> 
>
> పెరిగిన కూరగాయల ధరలు చూస్తే ఆదాయం సరిపోవడం లేదు. ప్రభుత్వం రైతు బజార్లలో తక్కువ రేట్లకు కూరగాయలను అందజేయాలి. ప్రభుత్వం ఆదుకోకపోతే ఏమి తినాలో తెలియని పరిస్థితిలు దాపురిస్తాయి.
>
> తోట పెద్దిరాజు, వినియోగదారుడు

ఎనీమియాపై అవగాహన సదస్సు



కాళ్ల ప్రభుత్వాసుపత్రి వద్ద అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు సునీల్

కాళ్ల: సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి వారసత్వం ద్వారా వచ్చిన ఎర్ర రక్త కణాల రుగ్మతల సమూహామని కాళ్ల ప్రభుత్వాసుపత్రి వైద్యులు సరాబు సునీల్ తెలియజేశారు. కాళ్ల ప్రభుత్వాసుపత్రి వద్ద సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు సునీల్ మాట్లాడుతూ మన రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి కారణమయ్యే జన్యువులు లోపభూయిష్టంగా ఉంటాయని తెలిపారు. ఈ వ్యాధిని 2047 నాటికి నిర్మూలించుటకు ప్రభుత్వం నిర్దేశించిందని తెలిపారు. 40 సంవత్సరాల లోపు వయసు గల వారికి ఈ వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. ఈ వ్యాధి వల్ల రక్తహీనత, కళ్లు పసుపు రంగులోకి మారటం, తీవ్రమైన కీళ్ల నొప్పులు, శ్వాస సమస్యలు ఉంటాయన్నారు. అదే విధంగా అలసట, గర్భధారణ సమయంలో సమస్యలు వంటి లక్షణాలు సంభవిస్తాయని స్పష్టం చేశారు. ఇది అంటువ్యాధి కాదని జన్యుపరంగా తల్లిదండ్రుల నుంచి మాత్రమే సక్రమిస్తుందన్నారు. ఈ వ్యాధి సోకిన వారికి రక్తం మార్పిడి చేయించాలని వివరించారు. కార్యక్రమంలో వైద్యులు డీ.సునీత, సూపర్వైజర్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

30 నుంచి ఆషాడ మాస జాతర మహోత్సవాలు

వీరవాసరం: రాయకుదురులో శ్రీ మావుళ్లమ్మ, మహాలక్ష్మమ్మ, శ్రీ పోతురాజు స్వామి వార్ల ఆషాడ మాస జాతర మహోత్సవాలు ఈనెల 30వ తేదీ నుంచి ప్రారంభించినున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కొండవీటి రామచంద్రరావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈనెల 30వ తేదీన అమ్మవార్లను ఆలయం నుంచి పూరిగుడిసెకు తీసుకు వెళ్లడం జరుగుతుందన్నారు. జులై 4వ తేదీ అమ్మవార్ల గవర్లగుడువు, 5వ తేదీన అమ్మవార్ల ఆషాడం జాతర మహోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, ఎంపీటీసీ కడలి నెహ్రూ, గెడ్డం భాస్కరరావు ,తోట విజయ్ కుమార్ ,పోలిశెట్టి శివన్నారాయణ, జడ్డు నానాజీ ,తోట సత్య ,కర్రి వెంకటేశ్వర రెడ్డి, రేలంగి వెంకటేశ్వరరావు, ఏలూరి సూర్యనారాయణ, దుర్గాప్రసాద్, కొప్పుల కిషోర్ ,గుడాల భాను ప్రకాష్, మోహన్ సాయి పాల్గొన్నారు.



ఆలయ కమిటీ సమావేశ దృశ్యం

టౌన్ ఆఫ్ ఎక్సలెన్సీ నిధుల కోసం వినతి

భీమవరం: భీమవరం పట్టణానికి మంజూరైన టౌన్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ నిధులను విడుదల చేయాలని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌ను కోరినట్లు వెస్ట్‌గోదావరి సీఫుడ్స్ ప్రాసెసింగ్ యూనిట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యర్రింకి సూర్యారావు చెప్పారు. ఢిల్లీలో ఆర్థికమంత్రి సీతారామన్, భారీపరిశ్రమశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, ఉక్కు, భారీపరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మలను మర్యాదపూర్వకంగా కలిసినట్లు సూర్యారావు చెప్పారు. భీమవరం ప్రాంతం నుంచి సీఫుడ్స్ పెద్ద ఎత్తున ఎగుమతులు అవుతున్నాయని దానికి సంబంధించి గతంలో టౌన్ ఆఫ్‌ఎక్స్‌లెన్సీ నిధులు మంజూరుకాగా వాటిని విడుదల చేయాలని మంత్రి నిర్మలాసీతారామన్ కోరినట్లు చెప్పారు. అలాగే సీఫుడ్ ఎగుమతులకు సహకరించాలని మంత్రి కుమారస్వామిని కోరినట్లు సూర్యారావు తెలిపారు.



ఢిల్లీలో కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సూర్యారావు

విద్యతోనే ఉన్నత స్థానం



చెరుకువాడలో విద్యాసామాగ్రి అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఉండి: క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తేనే మనిషి ఉన్నత స్థాయికి చేరుకుంటాడని చెరుకువాడ జడ్పీ హైస్కూల్ హెచ్ఎం గాదిరాజు వెంకట రామకృష్ణంరాజు అన్నారు. బుధవారం చెరుకువాడ పెదపేట ప్రాథమిక పాఠశాలలో దాతలు సాగిరాజు సాంబశివరాజు, మంగతాయారుల ఆర్థిక సహాయంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యాసామాగ్రి పంపిణీ సమావేశం నిర్వహించారు. హెచ్ఎం మంగతాయారు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జడ్పీ హెచ్ఎం రామకృష్ణంరాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునే సమయంలో చెడు వ్యసనాల జోలికి పోకూడదన్నారు. బాల్యంలో చదవు పట్ల విద్యార్థులు శ్రద్ధ కలిగి ఉండేలా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేగేశ్న అనంతలక్ష్మీ, కన్నెగంటి రూత్‌కళ మాట్లాడుతూ విద్యలో రాణించే వారికి జీవితంలో మంచి అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు గాదిరాజు రంగరాజు, ముదునూరి శివరామరాజు, గొట్టుముక్కల రాము, పెన్మెత్స రంగప్రసాద్, రామాంజనేయులు, బూనే, సీఆర్‌పీ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దంపతులకు సత్కారం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని తన మామ సరిపిడకల రామారావు నివాసానికి విచ్చేసిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్– లక్ష్మి సిందు దంపతులకు పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవస్థానం కమిటీ, హౌసింగ్ బోర్డు డెవలప్ మెంట్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ముందుగా మంత్రి శ్రీనివాస్ దంపతులు వెంకటేశ్వర స్వామి వారి దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అంజిబాబు, సరిపడకల రామారావు, దేవస్థానం చైర్మన్ కంతేటి వెంకటరాజు కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, జనపాటి మధు, జి మల్లేశ్వరరావు, హౌసింగ్ బోర్డ్ కాలనీ డెవలప్ మెంట్ కమిటీ సభ్యులు ఏం సూరిబాబు, కడలి వెంకటేశ్వరరావు, కోళ్ల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే అంజిబాబును కలసిని మంత్రి శ్రీనివాస్

భీమవరం: భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బుధవారం భీమవరంలో మర్యాద పూర్వకంగా కలిసారు. భీమవరంలో బంధువుల ఇంటికి వచ్చిన మంత్రి శ్రీనివాస్ ఎమ్మెల్యేను కలసి ఈ ప్రాంత అభివృద్ధికి కలిసి పని చేద్దామన్నారు. అనంతరం మంత్రి శ్రీనివాస్‌ను దుశ్శాలువాతో అంజిబాబు ఆయన కుమారుడు ప్రశాంత్, జనసేన జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు చెన్నమల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు

పాలకొల్లు (సెంట్రల్): దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. మార్టేరు వ్యవసాయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్.శ్రీనివాస్ భూసార పరీక్షలు, కర్బన ఉద్గారాలు, కొల్లేటి తీర పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మంచినీటి సంరక్షణ, కాలుష్య నివారణ చర్యలు, మన ప్రాంత పర్యావరణానికి అనుగుణంగా సాగు చేసుకోవాల్సిన పంటల గురించి అవగాహన కల్పించారు. పర్యావరణ పరిక్షణకు :పతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్, డాక్టర్ రూప్‌సింగ్, డాక్టర్ రమణ, డాక్టర్ సత్యనారాయణ, విద్యార్థినులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్.శ్రీనివాస్

నేడు ముత్యాలమ్మ హుండీ లెక్కింపు

మొగల్తూరు: ముత్యాలపల్లిలో వేంచేసియున్న శ్రీ బండి ముత్యాలమ్మ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించనున్నట్లు ఈవో డి.రామకృష్ణంరాజు బుధవారం తెలిపారు. హుండీ లెక్కింపులో పాల్గొన దలిచిన వారు తమ పేర్లను ముందుగా కార్యాలయంలో నమోదు చేయించుకోవాలని కోరారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

నరసాపురం రూరల్: మండలంలోని యర్రంశెట్టివారి పాలెంలో వేంచేసియున్న వెంకటేశ్వర స్వామి 14వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. యర్రంశెట్టి బాబులు, నాగముత్యమాంబ దంపతులు, కూనపరెడ్డి చంటి దంపతులు, యర్రంశెట్టి మోహనరావు దంపతులు, నందుల సత్యప్రసాద్ దంపతులు ఈ కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. కన్నుల పండుగగా జరిగిన ఈ వేడుకలను తిలకించేందుకు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అఖండ అన్నసమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



యర్రంశెట్టివారిపాలెంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

తాగునీటి కోసం ప్రజల ఇక్కట్లు

మొగల్తూరు: మొగల్తూరు పంచాయతీ వడయార పేట గ్రామస్తులు గత వారం రోజులుగా తాగునీరందక ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం మొగల్తూరులోని భారీ మంచినీటి చెరువు నుంచి తాగు నీరు సరఫరా అవుతుంది. అయితే కొన్ని రోజులుగా తాగు నీరందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహన్‌రావును వివరణ కోరగా నీటి సరఫరాలో ఏర్పడిన సమస్య కారణంగా తాగు నీరందడం లేదని, రెండురోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు.

చేనేతలకు అండగా నిలవాలి

పెనుగొండ: నూతన ప్రభుత్వం చేనేతలకు అండగా నిలవాలని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ జిల్లా అధ్యక్షుడు అల్లాడ సూర్య భాస్కరరావు ఒక ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వంలో చేనేతలకు రూ.24 వేలు అందించారని తెలిపారు. చేనేత వ్యవస్థను నమ్ముకొని బడుగు బలహీన వర్గాలు ఉన్నాయన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

నరసాపురం: విద్యార్థులు చదువు విలువ తెలుసుకొని కష్టపడి చదవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ సూచించారు. పట్టణంలోని 31వ వార్డు నిప్పులేటి హైమావతి హైస్కూల్‌లో విద్యార్థులకు బుధవారం విద్యా కిట్స్ పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చైర్‌పర్సన్ మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమానికి ఎంతో కృషి చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే ఒరవడి కొనసాగించాలని కోరుకుంటున్నామన్నారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.సూర్యకుమారి మట్లాడుతూ తమ పాఠశాలలో ప్రతీ ఏటా పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో బళ్ల తాతాజీ, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ

టీచర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణరాజు



సత్యనారాయణరాజు (ఫైల్‌ఫోటో)

ఉండి: నోబెల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉండి మండలం పాందువ్వ ఎంపీయూపీ స్కూల్ హెచ్ఎం పెన్మత్స సత్యనారాయణరాజు నియమితులైనట్లు ఆయన బుధవారం పత్రికా ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు నోబెల్ టీచర్స్ అసోసియేషన్ సిద్ధంగా ఉందన్నారు.

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

పాలకోడేరు: ఎన్నికలు పూర్తయి కొత్త ప్రభుత్వం ఏర్పడినందున గ్రామంలో అన్ని వర్గాల వారు కలిసి మెలసి ప్రశాంతంగా జీవించాలని పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు హితవు పలికారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. బుధవారం శృంగవృక్షం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శాంతి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఓడిపోయిన వారిని గేలి చేయడం గానీ, గెలిచిన వారి బ్యానర్లు, ఫ్లెక్సీలు ధ్వంసం చేయడం గానీ, కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం గానీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గులిపల్లి సత్యనారాయణ, ఎంపీటీసీ సత్యకృష్ణ, కుసుమ గుప్త, కొల్లా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

26న సీఐటీయూ ఆధ్వర్యంలో సెమినార్

భీమవరం: సీఐటీయు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరస సత్యనారాయణ శతజయంతిని పురస్కరించుకుని ఈనెల 26వ తేదిన భీమవరంలో రాష్ట్ర సెమినార్ నిర్వహిహించనున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జెఎన్‌వీ గోపాలన్, కె రాజారామ్మోహన్‌రాయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మిక వర్గం–ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నామన్నారు. సెమినార్‌కు ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఇళ్ల వెంకటేశ్వరరావు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మంతెన సీతారామ్, రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు.